క్లుప్తంగా

హార్వెస్టర్లతో నూర్పిడి మేలు



నకరికల్లు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను మూడు నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు గురువారం హెచ్చరించారు. హార్వెస్టర్లతో మాత్రమే వరి కోత చేసి, ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని తెలిపారు. వరి ఏ–గ్రేడ్ క్వింటా రూ.2,320, 75కేజీల బస్తా రూ.1,740, సాధారణ రకం క్వింటాకు రూ.2,300, 75 కేజీల బస్తా రూ.1,725గా నిర్ణయించినట్లు వెల్లడించారు. పంటను రైతు సేవ కేంద్రాల్లో విక్రయించేందుకు.. రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

తొండపిలో రెవెన్యూ సదస్సు



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పాల్గొన్నారు. గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 93 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. పెన్షన్ మంజూరు కోసం 31, రైస్ కార్డులకు 33, రెవెన్యూ సమస్యలపై 29 అర్జీలు అందాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్వేయర్ సుధాకర్, ఆర్ఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు పర్యాటక అభివృద్ధికి వినతి



అమరావతి: జిల్లాలోని అమరావతి, నాగార్జున కొండ, నాగార్జున సాగర్ పర్యాటక కేంద్రాలకు అభివృద్ధి చేయాలని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్ రావత్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు గురువారం ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన ఫోన్ ద్వారా మాట్లాడుతూ నాగార్జున కొండ, అమరావతి మహా చైత్యం, మ్యూజియంలు ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నిధులు మంజూరు చేసి, అభివృద్ధి చేయాలని కోరామని తెలిపారు.

దివ్యాంగుల భవనం నిర్మించాలి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో దివ్యాంగులకు ప్రత్యేక హోమ్ నిర్మించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మంగళగిరి రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఎన్నో ఉద్యమాలు, ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి పెన్షన్ రూ. 6 వేలకు సాధించుకోవడం జరిగిందన్నారు. ఏటా డిసెంబర్ 3న దివ్యాంగుల దినోత్సవం పల్నాడు జిల్లాలో జరుపుకుండా గుంటూరులో జరుపుతున్నారన్నారు. దీనిపై తాము అభ్యంతరం తెలియచేయగా ఈ నెల 19న జిల్లాలో జరపటానికి ఏడీ అంగీకరించి చివరకు జరపకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రత్యేక ఏడీని నియమించాలన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులు, కిడ్నీ బాధితులకు సంబంధించి 3.50 లక్షల పెన్షన్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేసి, వారికి నోటీసులు కూడా అందించిందన్నారు. ఆ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాల న్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నకరికల్లు: అనారోగ్యం కారణంగా ఎలుకల మందు తిన్న వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. నకరికల్లుకు చెందిన బండారు ద్వారక(42) ఈ నెల 13న తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఎలుకల పేస్టు తీసుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను వైద్యశాలకు చేర్చగా గుంటూరులోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమార్తె ఇర్లా రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

అమరావతి: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు దారా ప్రసాద్, ప్రజా సంఘాల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్‌చేశారు. నాయకులు దాసు, తోకల సూరిబాబు, రాజ్‌కుమార్, మురహరి మొహిద్దీన్‌వలి, నాగరాజు పాల్గొన్నారు.

క్రోసూరు: కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే క్యాబినెట్ నుంచి తొలగించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి చైర్మన్ గార్లపాటి దాస్ గురువారం డిమాండ్ చేశారు. స్థానిక విగ్రహాల సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిలక భాస్కరరావు. కంచర్ల అచ్యుతరావు, మందడపు నాగయ్య పాల్గొన్నారు.

నీరు.. నిబంధనలు పాటించరు..!

- పుట్టగొడుగుల్లా గ్రామాల్లో అనుమతి లేని వాటర్ ప్లాంట్లు
- శుద్ధ జలం పేరుతో నాణ్యత లేని నీటి విక్రయం
- ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు
- అనధికార వాటర్ ప్లాంట్లను పట్టించుకోని అధికారులు



బెల్లకొండ మండలంలో ఒక గ్రామంలో వాటర్ ప్లాంట్

బెల్లంకొండ: మినరల్ వాటర్ ప్రస్తుతం తాగు అవసరాలకు సాధారణమైంది. ప్రజల అవసరాన్ని ఆదాయం వనరుగా మార్చుకున్న వ్యాపారులు అనధికారికంగా ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. మినరల్ వాటర్ తయారీలో నిర్వాహకులు ప్రమాణాలు పూర్తిస్థాయిలో విస్మరించారు. మినరల్ పేరిట జనరల్ వాటర్‌ను సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో నాణ్యతలేని నీటితో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటి దోపిడీ, నాణ్యత ప్రమాణాలను పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యమైంది.

ఒక్కో గ్రామంలో రెండేసి ప్లాంట్లు

పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో రెండేసి చొప్పున కూడా ఏర్పాటు చేశారు. కాగా ఎక్కువ శాతం గ్రామాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నీటిని తయారు చేస్తున్నారు. భూగర్భ జలాలను నామ మాత్రంగా శుద్ధి చేస్తూ విక్రయిస్తున్నారు. ఈ నీళ్లకు అలవాటు పడిన ప్రతి ఒక్కరూ మినరల్ వాటర్ తాగుతున్నామన్న భ్రమలో ఉంటున్నారు. శరీరంలో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు ఈ నీటి వల్లే అని గ్రహించ లేకపోతున్నారు. కీళ్ల, మోకాళ్ల నొప్పుల నుంచి జీర్ణ ప్రక్రియ సమస్య, డయేరియా, జలుబు, దగ్గు, ఇతర దీర్ఘకాలిక సమస్యలు, విషతుల్య కారకాలు శరీరంలో పేరుకుపోవడం వంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

ఐఎస్ఐ గుర్తింపు లేదు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో చాలా వాటికి ఐఎస్ఐ గుర్తింపు లేదు. ప్రతి ప్లాంట్‌లో నీటిని నిల్వ చేసే ట్యాంక్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉండాలన్న ప్రధాన నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. చాలా వరకు వాటర్ ప్లాంట్లు పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆటోల్లో మినరల్ వాటర్ పేరుతో ఒక్కొక్క క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు ఇలా...

గ్రామ పంచాయతీలో అనుమతి తీసుకున్నాక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. వాటర్ క్యాన్ మీద నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నెంబరు నమోదు చేయాలి. ప్రతి నెలా శానిటరీ అధికారులు పరీక్షించి, ఆ నీటిని బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు పంపాలి. వాటర్ ప్లాంట్ ప్రారంభించాలంటే ఐఎస్ఐ నిబంధనలు తప్పక పాటించాలి. ప్లాంట్లో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులు ఏర్పాటు చేయాలి. శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్లెస్ స్టీల్ ట్యాంకులు మాత్రమే ఉపయోగించాలి. నీటిలో పీహెచ్ శాతం ఎంత ఉందో పరీక్షించాలి. పీహెచ్ శాతం 75 శాతం కంటే తగ్గితే ఆ నీటిని తాగిన వారు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు పాటించేలా చూడాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లలో నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నాణ్యత లేని ప్యూరిఫైడ్ వాటర్‌ను విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం నీటిని శుద్ధి చేయకుండా ప్రజారాజ్యంతో చెలగాటం మారడం సరికాదు. నిత్యం అధికారులు ప్లాంట్లపై తనిఖీ చేపట్టాలి.

– బి.నరసింహానాయక్, సర్పంచ్, న్యూచిట్యాల

తరచూ తనిఖీలకు ఆదేశాలిస్తాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను పంచాయతీ కార్యదర్శులు తరచూ తనిఖీలు చేసేలా చర్యలు తీసుకుంటాం. వారికి ఇప్పటికే ఈ మేరకు ఆదేశాలు ఇచ్చాం. నిబంధనలు పాటించకపోతే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఫిర్యాదులు ఉంటే కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలి.

– వై.హనుమారెడ్డి, ఎంపీడీవో, బెల్లంకొండ.

ముగిసిన శిక్షణ తరగతులు

రాజుపాలెం: శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధిలో పాటించాలని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యంగా శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జునశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సర్పంచ్‌లు, ప్రజా పతినిధులు పాల్గొన్నారు.

విద్యా దాత శ్రీనాథచౌదరికి ఘన నివాళి



అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ మాజీ కరస్పాండెంట్ మల్లెల శ్రీనాథచౌదరికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం పాఠశాల ఆడిటోరియంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాజేటి రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలను సమకూర్చి, భవిష్యత్తుకు బాటలు వేసిన మల్లెల శ్రీనాథచౌదరి ధన్యుడన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

క్రోసూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ సాధారణ సందర్శనలో భాగంగా వచ్చినట్లు చెప్పారు. మీతో మేము కార్యక్రమం ప్రజలకు బాగా ఉపయోగపడుతుందన్నారు. స్టేషన్‌లో కేసుల రిజిస్టర్లను పరిశీలించినట్లు తెలిపారు. క్రోసూరు ట్రాఫిక్ సమస్యపై దృష్టిపెట్టాలని ఎస్ఐను ఆదేశించారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు. సీఐ పి.రమేష్, ఎస్ఐ నాగేంద్రరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ఎం.హనుమంతరావు

భూ సమస్యలను పరిష్కరించండి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

అచ్చంపేట: డీకే పట్టాలు పొంది, ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు తమవంటూ తరచూ ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కేసులు పెడుతున్నారని, పెనాల్టీలు వేస్తున్నారంటూ తాళ్లచెరువు, కొత్తపల్లి, చెరుకుంపాలెం గ్రామాల రైతులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. తాళ్లచెరువులో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు గంజిమాల రవిబాబు ఆధ్వర్యంలో రైతులు అధికారులకు తమ బాధ వెల్లబోసుకున్నారు. 1993లో సర్వే నంబరు 314, 331లో వంద మంది రైతులకు పైగా ఎకరం, రెండెకరాల చొప్పున రెవెన్యూ శాఖ డీకే పట్టాలిచ్చినట్లు చెప్పారు. కొంత మంది ఆ భూములను చదును చేసుకుని సేద్యం చేసుకుంటున్నట్లు చెప్పారు. గతేడాదిగా ఫారెస్ట్ అధికారులు ఈ భూములు ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని, వీటిపై తమకు అధికారం లేదంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ అందరికీ న్యాయం జరిగేలా సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ల, పూర్తి స్థాయిలో భూములపై హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. డిప్యూటీ రేంజ్ అధికారి రత్నం, వీఆర్వో శేషయ్య పాల్గొన్నారు.

ఆశ్రిత వరదుడుగా శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని ఆశ్రిత వరదుడుగా గురువారం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారి దివ్య మనోహర రూపాన్ని దర్శించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీవారి సేవకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



క్రీస్తు బోధనలు అనుసరణీయం



సత్తెనపల్లి: క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 21వ వార్డు తెలుగు బాప్టిస్ట్ చర్చ్, ఎన్టీఆర్ కళాక్షేత్రం, మండలంలోని పాకాల పాడు గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీస్తు చూపిన శాంతి, సహన మార్గంలో అందరూ పయనించాలన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. సెమీ క్రిస్మస్ వేడుకల నిర్వాహకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి వాసవి మణికంఠ క్లబ్‌కు అవార్డు



సత్తెనపల్లి: ఈ నెల 14, 15వ తేదీల్లో మధురైలో జరిగిన ఐకాన్‌లో వీ 204–ఏ వాసవి మణికంఠ క్లబ్(సత్తెనపల్లి)ను సూపర్ బెస్ట్ క్లబ్ గా ఇంటర్ నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవి చంద్రన్ ప్రకటించారు. క్లబ్ గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు వాసవి క్లబ్ సభ్యులు మణికంఠ క్లబ్ ప్రెసిడెంట్ వనమా నాగేశ్వరావుకు సూపర్ బెస్ట్ క్లబ్ అవార్డు అందజేశారు. పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు క్లబ్ సభ్యులను గురువారం అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ పెండేల సాంబశివరావు, ట్రెజరర్ సూరే శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కొప్పురావూరి కాశీ వెంకటసుబ్బారావు, జాయింట్ సెక్రటరీ అనుమాల శెట్టి వెంకటేశ్వర రావు, కట్టమూరి అప్పారావు, జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య, జెర్సీ కోట నాగ వరలక్ష్మి, రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, శ్రీనివాస డైమండ్ క్లబ్ ప్రెసిడెంట్ అయినవోలు కోటేశ్వరరావు, వనమా భవిత్ ఉన్నారు.

ట్రూ అప్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలి

సత్తెనపల్లి: విద్యుత్ ట్రూ అప్ చార్జీలపై పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలపై భారం మోపారని, తక్షణమే అదనపు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు, అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల పై రూ.6,072 కోట్ల మేర భారం మోపారని, జనవరి నుంచి మరో రూ. 9,414 కోట్లు భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. అదానీ అవినీతి అక్రమాల పై అమెరికా ప్రభుత్వం కేసు నమోదు చేసినా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నోరు మెదపటం లేదని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతోందని, దీని వల్ల ప్రజలపై పడే అవకాశం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, నాయకులు కట్టా శివ దుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, గుంటుపల్లి బాలకృష్ణ, ముక్కపాటి నరసింహారావు, సీపీఐ నాయకులు ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

ఉద్యాన పంట రాయితీలపై అవగాహన

రాజుపాలెం: ఆయిల్ ఫాం సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని లాం ఫాం శాస్త్రవేత్త టి.విజయలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని కోటనెమలిపురి గ్రామంలోని టమోటా రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సస్యరక్షణ చర్యలు చేపడితే పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. నకరికల్లులో నిర్మించనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను వివరించారు. కూరగాయలు, బంతి పూలు తదితరాలు సాగు చేస్తున్న రైతులకు సాంకేతిక సలహాలు అందజేశారు. ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్ ఫాం, వెదురు బొంగులు, హైబ్రీడ్ కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ వర్తిసుందని చెప్పారు. ఉద్యాన సహాయకులు రమేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న లాం ఫాం శాస్త్రవేత్త టి.విజయలక్ష్మి

ఉపాధి పనుల్లో రూ.2.55 లక్షల రికవరీకి ఆదేశం

రాజుపాలెం: ఉపాధి హామీ పనుల నిర్వహణలో అవినీతి చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మట్టా సిద్ధ లింగమూర్తి అన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించిన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి 700 పనులు నిర్వహించి, రూ 10.53 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వేతనాల రూపంలో రూ.8.71 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1.82 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. సోషల్ ఆడిట్ బృందం నిర్వహించిన సామాజిక తనిఖీ చేపట్టిన అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా రూ.2,55,663లు రికవరీ ఆదేశించామన్నారు. అలాగే మరో రూ.25 వేల అపరాధ రుసుం విధించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పి.వెంకట నారాయణ, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, జిల్లా జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రభాకర్, ఎస్ఆర్‌పీ ఎం.లోకేష్, డీఆర్‌పీలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ మట్టా సిద్ధ లింగమూర్తి

● పూత పూస్తోంది.. కాపు రావడం లేదు



పెదకూరపాడులో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు

మిర్చి మొక్కలు నాటి వంద రోజులు దాటిన మొక్కకు పూత వస్తోంది కానీ...కాపు రావడం లేదంటూ మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. 9211 నంబరు కలిగిన మిర్చి రకం విత్తనాలు, 303 లాట్ నంబర్లు కొనుగోలు చేశామని, పూత ఉన్న పిందా, కాపు రావడం లేదంటూ పెదకూరపాడులో పలువురు రైతులు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పెదకూరపాడులోని మిర్చి రైతు అశోక్ మిర్చి పంటను ఉద్యాన శాఖ అధికారి శ్రీ నిత్య, వ్యవసాయ శాఖ అధికారి శాంతి పరిశీలించారు. పూత ఉన్న పలు మొక్కలకు పిందెలుగా ఉన్న కాపు కాకుండానే రాలిపోతున్నాయని రైతులు తెలిపారు. నకిలీ విత్తనాలు తీసుకొని మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది పెదకూరపాడు ప్రాంతంలో నకిలీ విత్తనాలు కలకలం జరుగుతూనే ఉన్నా.. అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో విత్తనాల కంపెనీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆయా శాఖ అధికారులు మాట్లాడుతూ లాంగ్ ఫ్రాంక్ శాస్త్రవేత్తల ద్వారా పంటలను పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

– పెదకూరపాడు

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ కోరారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. బందగీ సాహెబ్ మాట్లాడుతూ గ్రామ వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలకు గ్రేడ్–1 గ్రామ రెవెన్యూ అధికారులుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే లక్ష్మీ నారాయణ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పినట్లు వెల్లడించారు. ఇటీవల సస్పెండ్ చేసి అమరావతి మండలం పెదమద్దూరు వీఆర్ఏ మేకల ప్రేమ్ కుమార్ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. సంఘం సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పి. సంజీవరావు, మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, ఉపాధ్యక్షులు బ్రహ్మ య్య, సుందర్రావు, ఆంజనేయులు, కాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందిస్తున్న షేక్ బందగీ సాహెబ్

వ్యవసాయ మోటార్‌లో రాగి తీగ చోరీ



బెల్లంకొండ: పొలంలో ఉన్న వ్యవసాయ మోటార్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి తీగ చోరీ చేసిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గురువారం బాధితుడు పింగళి రవీంద్రారెడ్డి వివరాల ప్రకారం గ్రామంలోని గంగమ్మ గుడి సమీపంలో ఉన్న తన పొలంలోని వ్యవసాయ మోటార్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి, వైర్లను కట్ చేసి రాగి తీగను దొంగిలించినట్లు తెలిపాడు. ఈ ఏడాది ఆగష్టు 2న కూడా తన పొలంలో ఇదే మోటర్ వద్ద చోరీ జరిగిందని, మళ్లీ రెండవసారి దుండగులు చోరీకి పాల్పడ్డారని వాపోయాడు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదని బాధితుడు తెలిపారు.. కాగా మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల కాలంలో పొలాల్లోని మోటార్ల వద్ద రాగి తీగ చోరీ ఘటనలు ఎక్కువ అవుతున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభమవడంతో పొలాల్లోని మోటార్లను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. రాగి తీగ దొంగలను పోలీసులు వెంటనే పట్టుకోవాలని కోరుతున్నారు.